క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



దుర్గాదేవిని దర్శించుకున్న హరీశ్‌రావు

జహీరాబాద్: మొగుడంపల్లిలోని జాడిమల్కాపూర్ గ్రామంలో జరుగుతున్న దుర్గాదేవి ఉత్సవాలకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి, దుర్గాదేవిని దర్శించుకున్నారు. హరీష్‌రావును ప్రజలు గలమాలతో సత్కరించి ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ

ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: బసవేశ్వరుడి విగ్రహావిష్కరణకు ప్రభుత్వ యంత్రాంగం, లింగాయత్ సమాజ్ నాయకులు ఏర్పాట్లు చేస్తోంది. జహీరాబాద్ సమీపంలో 65వ జాతీయ రహదారి పక్కన హుగ్గెల్లి చౌరస్తాలో ప్రభుత్వం, దాతల సహకారంతో జిల్లాలోనే భారీ బసవేశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ నెల 23న సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో బసవ భక్తులు తరలిరావాలని ఎంపీ. సురేష్‌షెట్కార్, లింగాయత్ సమాజ్ నాయకులు పిలుపునిచ్చారు.

కాంప్లెక్స్ ఎరువులు వాడండి

వ్యవసాయ నిపుణులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): యూరియాకు బదులుగా కాంప్లెక్స్ ఎరువులనే వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ హేమలత రైతులకు సూచించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ...కాంప్లెక్స్ ఎరువుల ఉపయోగం సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత, టమాటాలో వచ్చే సాధారణ వ్యాధులు, నర్సరీ నిర్వహణ వంటి విషయాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. రైతులకు లభ్యమౌతున్న వివిధరకాల సబ్సిడీలను డాక్టర్ జానకి శ్రీనాథ్ వివరించారు.

పునరావాసం కల్పించాలి



మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: నిమ్జ్ పరిధిలోని భూములపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీలకు పునరావాసం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో బుధవారం వ్యవసాయ కూలీలు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం చేపడుతున్న భూసేకరణ 2013 చట్టం ప్రకారం చేపట్టకుండా ఏక పక్షంగా ముందుకు వెళ్లుతుందని వాపోయారు. వేల ఎకరాల భూములు తీసుకుంటూ వ్యవసాయ కూలీలను పట్టించుకోవడం లేదన్నారు. 23న జహీరాబాద్‌కు వస్తున్న సీఎం పునరావాసం ప్రకటించాలని కోరారు.

మట్టి రవాణా వాహనాలు సీజ్

సాక్షి ఎఫెక్ట్

జిన్నారం (పటాన్‌చెరు): జోరుగా అక్రమ మట్టి రవాణా శీర్షికన 21న(బుధవారం) సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేశారు. గడ్డపోతారం మున్సిపాలిటీలోని సర్వేనంబర్ 79లో అర్ధరాత్రి నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. మట్టి రవాణాపై రెవెన్యూ యంత్రాంగంతో కలిసి నిఘా పెంచుతామన్నారు.



సీజ్ చేసిన జేసీబీలు, టిప్పర్లు

శీతల గిడ్డంగిపై.. శీతకన్ను

నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాని శీతల గిడ్డంగి

- కన్నెత్తి చూడని హార్టికల్చర్ అధికారులు
- ఎదురుచూస్తున్న రైతులు



శిథిలావస్థకు చేరిన శీతల గిడ్డంగి

జిన్నారం (పటాన్‌చెరు): రైతులు పండించే పంటలను నిల్వ చేసుకొనేందుకు శీతల గిడ్డంగిని జిల్లా హార్టికల్చర్, అప్సా సంస్థ సౌజన్యంతో ప్రభుత్వం భారీ వ్యయంతో గుమ్మడిదలలో నిర్మించింది. గిడ్డంగి నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకుండా వృథాగా ఉంది. మండల రైతులకు సంబంధించిన విత్తనాలు, కూరగాయలు భద్రపరిచేందుకు శీతల గిడ్డంగి లేదు. దీంతో రూ.33 లక్షల నిధులతో శీతల గిడ్డంగిని నిర్మించారు. నిర్మించిన గిడ్డంగి ఎటువంటి కార్యకలాపాలు నోచుకోక వృథాగా మారింది. ప్రజాధనాన్ని నిర్వీర్యం చేశారని రైతులు వాపోతున్నారు. ఎప్పుడెప్పుడు శీతల గిడ్డంగిని ప్రారంభిస్తారని రైతులు ఎదురుచూస్తున్నారు.

అధికారుల సమన్వయ లోపం

మండలంలో కొత్తగా నిర్మించిన శీతల గిడ్డంగి పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము పండించిన కూరగాయలు, పంటలు నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసుకున్న శీతల గిడ్డంగి ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక శీతల గిడ్డంగిలో ఉన్న పలు విలువైన సామగ్రి దొంగల పాలవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరుతోంది. గిడ్డంగి పక్కనే కల్లు కాంపౌండ్ ఉండడంతో ఇక మందుబాబులకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని వాపోతున్నారు. లక్షలు పెట్టి నిర్మించిన శీతల గిడ్డంగి అధికారుల సమన్వయ లోపంతో ప్రారంభానికి నోచుకోక వృథాగా మారిందని నిరాశ చెందుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

గుమ్మడిదల మండలంలో నిర్మించిన శీతల గిడ్డంగిని ప్రారంభించేందుకు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని మండల రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా మండలంలోని గుమ్మడిదల నల్లవల్లి, కొత్తపల్లి అంతారం గ్రామాల్లో రైతులు పెద్ద ఎత్తున కూరగాయ, మిర్చి పంటలు పండిస్తారు. ఇక్కడ పండించిన మిర్చిని రైతులు 200 కి.మీ ప్రయాణించి వరంగల్‌కు తీసుకుపోవాల్సిన పరిస్థితి దాపురించింది. స్థానిక రైతులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన రైతులు పండించిన పంటలను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగి అవసరం తప్పనిసరి. నిర్మాణం పూర్తి చేసుకుని వృథాగా మారిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు శీతల గిడ్డంగి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని మండల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల ఉపాధిలో శీతల గిడ్డంగి కీలక భూమిక పోషించనుంది.



మూలనపడ్డ జనరేటర్

వరంగల్ తీసుకెళ్తున్నాం..



స్థానికంగా పండిస్తున్న మిర్చి పంటను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగి అందుబాటులో లేకపోవడంతో దాదాపు 200 కిలోమీటర్లు తీసుకెళ్లి వరంగల్‌లో నిల్వ చేయాల్సి వస్తుంది. ప్రయాణం ఇబ్బందిగా మారింది. రైతుల సమస్యలు తీరాలంటే శీతల గిడ్డంగిని ప్రారంభించాలి.

– సదానందరెడ్డి, గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షుడు

రైతులకు న్యాయం చేయాలి



శీతల గిడ్డంగి ప్రారంభమవుతోందని సంతోషంగా ఉన్నాం. గిడ్డంగి అవసరాలకు సంబంధించి విద్యుత్ ఇతర అవసరాలను సమకూర్చాం.. కానీ గిడ్డంగి నిర్మాణం జరిగినా ప్రారంభం కాకపోవడం విచారంగా ఉంది. హార్టికల్చర్ అధికారులను ఆదేశించి, ప్రారంభానికి జిల్లా కలెక్టర్ చొరవ చూపాలి.

– బాల్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు

యూరియా వాడకం తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: పంటపొలాల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పసల్వాది గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు యూరియాను సాగుకు అవసరం మేర వాడుకోవాలన్నారు. పశువుల పేడ, వర్మి కంపోస్టు వంటి సహజ ఎరువుల వాడకంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు పంట మొదలు పెట్టిన నాటి నుంచి పంట కోసే వరకు వ్యవసాయ పెట్టుబడి సంబంధించిన రసీదులను భద్రపరుచుకోవాలని అన్నారు. దీంతో రైతులకు నష్టపరిహారం అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల శాస్త్రవేత్తలు, ఎంపీడీఓ యాదగిరి, మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీ, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాతకు ఘన నివాళి



జహీరాబాద్ టౌన్: నివాళులర్పిస్తున్న ఎంపీ

జహీరాబాద్ టౌన్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఎంపీ సురేష్ షెట్కార్ బుధవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పంచాయతీ వ్యవస్థ పటిష్టత కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 21వ శతాబ్దంలోనే దేశాన్ని నూతన పథంలో నడిపించేలా దిశానిర్దేశం చేశారని కొనియాడారు.

సంగారెడ్డి రాజీవ్ పార్క్‌లో

సంగారెడ్డి: సంగారెడ్డి రాజీవ్ పార్క్‌లో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ నేతలు తోపాజి అనంత కిషన్, కూన సంతోష్ , కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం పట్టణంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేటర్ పుష్ప, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ పాల్గొన్ని రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

పటాన్‌చెరు: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నేపథ్యంలో బస్టాండ్ సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలవేసి కాంగ్రెస్ శ్రేణులు నివాళులర్పించారు.

సాంకేతిక విప్లవానికి నాంది..

పటాన్‌చెరు టౌన్: దేశానికి సాంకేతికతను తీసుకుని వచ్చి ప్రపంచంలో టెక్నాలజీ విప్లవంలో భారత్‌ను నిలిపింది రాజీవ్‌గాంధీనేనని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం చిట్కుల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

జిన్నారం తహసీల్దార్‌గా దేవదాస్



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం తహసీల్దార్‌గా దేవదాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి తహసీల్దార్‌గా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన భిక్షపతి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో భూసమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

ఎంపీఓ మహేందర్ రెడ్డి



కంది(సంగారెడ్డి): వననర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిదురుప్ప ఆరుట్ల, బేగంపేట్‌లో వననర్సరీలతో పాటు డంప్‌యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో నాటేందుకు మొక్క లు సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రామానికి ఆరు వేల చొప్పున మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల, పూల మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం.. ప్రజలు ఇక్కట్లు



హుడా మార్గంలో నిలిచిన వరద



రామచంద్రాపురం: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రోడ్డుపై..



నారాయణఖేడ్: చాప్టా(కె)లో ఎగిరిపడిన ఇంటి పైకప్పు రేకులు

ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నీళ్ల నిల్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల పైకప్పు, గోడలు కూలిపోయాయి. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు.

– సాక్షి, నెట్‌వర్క్

సంక్షిప్త వార్తలు

◆ నేడు ఫైలేరియా నివారణ శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఫైలేరియా వ్యాధి నిర్మూలనలో భాగంగా నేడు సా. 8 గంటల నుంచి 10 గంటల వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం ఆధ్వర్యంలో రక్తపూతలు సేకరించనున్నట్లు మండల వైద్యాధికారి మధుకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు.

◆ తడి, పొడి చెత్తపై అవగాహన

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో శానిటరీ అధికారి శ్రీనివాస్ తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయొద్దని సూచించారు. గతంలో పంపిణీ చేసిన చెత్త బుట్టల్లో తడి పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ ఆటోల్లో వేయాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు.

◆ పటాన్‌చెరులో తిరంగా ర్యాలీ

పటాన్‌చెరు: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ పరిధిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ.. భారత సైన్యం తలుచుకుంటే పాకిస్తాన్ ప్రపంచ చిత్రపటంలోని ఉండదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ పాల్గొన్నారు.

◆ ఇద్దరు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా, సదాశివపేటకు చెందిన మోహన్‌రాజు(55) ఈ నెల 18న కూకట్‌పల్లిలో ఉండే సోదరుడు నర్సింహారెడ్డి ఇంటికి వచ్చాడు. తిరిగి 20న నర్సింహారెడ్డి కుమారుడు గంగాధర్, మోహన్‌రాజును సదాశివపేట పంపించేందుకు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని పటాన్‌చెరు వరకు తీసుకొచ్చాడు. పటాన్‌చెరులో ర్యాపిడో బైక్ బుక్ చేసి పంపించాడు. ఇస్నాపూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోహన్‌రాజు బైక్ దిగి, కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

సంగారెడ్డి క్రైమ్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేష్ కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన పద్మశాలి శ్రీనివాస్(42), ఈనెల 20న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. బుధవారం భార్య జయసుధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ సీఐటీయూతోనే సమస్యలు పరిష్కారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఐటీయూని యూనియన్ ఎన్నికల్లో గెలిపించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని అంకేనపల్లి శివారులోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ వద్ద కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో ఈనెల 28 జరిగే ఎన్నికల్లో కార్మిక పక్షపాతి నిరంతర కార్మిక శ్రేయస్సు కోరే సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఎఫ్ యూనియన్ నాయకులు నర్సింలు, కృష్ణమూర్తి, రాజయ్య, విజయవీర్, వెంకటేశం, రమేష్ రెడ్డి, హాజీ, బాగారెడ్డి, లక్ష్మారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

◆ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వట్‌పల్లి(అందోల్): పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జోషి అన్నారు. బుధవారం మండలంలోని ఖాదిరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. ఏడాది పాలనలోనే సొంతింటి కలను నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజయ్య, ఇన్‌చార్జి ఎంపీఓ ఖజానాసిరోద్దీన్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రావు పాటిల్, ఏఎంసీ డైరెక్టర్ దిగంబర్‌రావు, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల విత్తనాలు విక్రయించొద్దు

ఏడీఏ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

రాయికోడ్(అందోల్): ఇతర రాష్ట్రాలకు చెందిన పత్తి విత్తనాలను విక్రయించవద్దని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ ఫెర్టిలైజర్ నిర్వాహకులను ఆదేశించారు. రాయికోడ్‌లోని రైతు వేదికలో బుధవారం రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి మండలాలకు చెందిన ఫెర్టిలైజర్ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పత్తి విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. శాఖపరంగా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారకాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలన్నారు. ఆయా మండలాల ఫెర్టిలైజర్ దుకాణ నిర్వాహకులకు ఈ పాస్ మిషన్‌లను అందజేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయికోడ్ ఏఓలు సారిక, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు

కంగ్టి(నారాయణఖేడ్): ఖరీఫ్ సీజన్ సమీపించడంతో రైతులు విత్తనాలు కొనుగోలు, ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... స్థానిక పరిస్థితులకు, భూముల రకాలకు అనుకూలమైన, మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలు ఎంచుకోవాలన్నారు. వ్యవసాయశాఖ అనుమతి పొందిన అధికారిక డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదు తీసుకుని భద్రపరుచుకోవాలని చెప్పారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ నాగేశ్వర్‌రావు



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

వట్‌పల్లి(అందోల్): దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ పి.నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం జోగిపేట డివిజన్‌లోని అన్నాసాగర్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో విద్యుత్ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, మరమ్మతులు, ఇతర సమస్యలపై ఆరా తీసి వినతులను స్వీకరించారు. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రైతులకు, వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ హెచ్చుతగ్గులు, మీటరు, బిల్లులు వంటి సమస్యలతో పాటు కొత్త సర్వీసులను ఇవ్వడంలో నిరాకరణ, జాప్యంపై ఫోన్ 040-23431447, 23431432 నంబర్లకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఇండిపెండెంట్ సభ్యుడు వెంకట్, డీఈ శ్రీనివాసులు, ఏడీఈలు శ్రీనివాస్‌రావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం మాటున రసాయనాల విడుదల



పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. వర్షపు నీటి మాటున గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని విష్ణు కెమికల్ పరిశ్రమ రసాయన వ్యర్థ జలాలను విడుదల చేసింది. పరిశ్రమ నిర్వాకంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం కురిసినప్పుడల్లా ఇదే వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థ జలాలను విడుదల చేసిన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, బొంతపల్లి పారిశ్రామికవాడలోని హెటిరో యూనిట్-1 పరిశ్రమ యాజమాన్యం పెద్ద ఎత్తున రసాయన వ్యర్థ జలాలను సమీపంలోని దోమడుగు నల్లకుంటలోకి విడుదల చేసింది. దీంతో స్థానికులు చెరువులు, కుంటలను వ్యర్థలతో నిండిపోయి కలుషితమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థ జలాలు తాగి మూగజీవులు మృతి చెందే ప్రమాదం ఉందని వాపోయారు. ఈ వ్యవహారంపై స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఎంఈఓ, ఆర్పీలు

కంగ్టి(నారాయణఖేడ్): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ మహ్మద్ రహీమొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సులభం నుంచి కఠినమైన విషయాలు బోధించడంతో అవగతమవుతుందన్నారు. దృశ్యశ్రవణ పరికరాలు వినియోగించి బోధన జరపాలని సూచించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల మండల ఆర్పీలు శివారెడ్డి, పాల్‌సుందర్‌రాజ్, మురళీకృష్ణ, ఫిరోజలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యాసనాభివృద్ధిపై దృష్టి సారించాలి

రాయికోడ్(అందోల్): విద్యార్థుల అభ్యాసనాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంఈఓ టి.మాణేయ్య ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, బోధన విధానం, ఇతర ప్రత్యేకతలను తల్లిదండ్రులకు వివరించి అడ్మిషన్లు పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువుల సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని చెరువుల పరిరక్షణకు బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. తహసీల్దార్ శివశ్రీనివాస్ ఆధ్వర్యంలో మార్డి, బీబీపేట్, ఫత్తేపూర్ చెరువుల వద్ద సర్వే చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, విస్తీర్ణాన్ని గుర్తించి సర్వేయర్ హద్దులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, కాంగ్రెస్ నాయకులు ఎన్నం సంగారెడ్డి, కుమ్మరి సంజీవులు పాల్గొన్నారు.